క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోనీ అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సన్మానం


స్టాఫ్‌నర్స్ పుష్పావతిని సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

జూపాడుబంగ్లా: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్టాఫ్‌నర్స్ పుష్పావతి కర్నూలు కంటి వైద్యశాలకు బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు గంగాధర్, సభా సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మి, ల్యాబ్‌టెక్నీషియన్ చెంచన్న, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్సులు సరిత, వెంకటరమణమ్మ, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా వెంకటకృష్ణారెడ్డి

వెలుగోడు: ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా రేగడగూడూరు గ్రామానికి చెందిన వంగాల వెంకటకృష్ణారెడ్డి నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ఎన్నికైన వెంకటకృష్ణారెడ్డిని పలువురు అభినందించారు.

సర్పంచ్‌కు సత్కారం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు


వెలుగోడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్‌ను ఎస్‌డీపీఐ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. 9వ వార్డులో సిండికేట్ బ్యాంక్ ఎదురుగా నూతనంగా మురుగు కాలువ నిర్మించడంతో ఎస్‌డీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌ను సన్మానించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎస్‌డీపీఐ శ్రీశైలం అసెంబ్లీ అధ్యక్షులు అరిఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌షావలి స్వామి జార్తలు


పీరును మఖానానికి చేరుస్తున్న దృశ్యం

మహానంది: బసవాపురం గ్రామంలో లాల్ సావలి స్వామి పీర్ల జార్తలు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శాకంబరిదేవిగా కొలనుభారతి అమ్మవారు



కొత్తపల్లి: మండలంలో సరస్వతీ క్షేత్రంగా వెలుగొందుతున్న కొలనుభారతి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. పురోహితుడు శ్రీనివాస శర్మ కూరగాయలు, ఆకుకూరలు, పూలమాలలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కొత్తపల్లి: నిబంధనలు అతిక్రమించి కృష్ణానదిలో మరబోట్లలో ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ జయశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం సిద్ధేశ్వరం ఘాట్‌ను తనిఖీ చేశారు. సిద్ధేశ్వరం వైపు నుంచి తెలంగాణ రాష్ట్రం సోమశిల ప్రాంతానికి కృష్ణానదిపై మరబోట్‌లో ప్రయాణికులను చేరవేస్తున్న సిద్ధేశ్వరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి బోటును సీజ్ చేశారు.

వర్షం.. హర్షం!

భూమిలో విత్తనం వేసి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న అన్నదాతలపై వరుణుడు కరుణించాడు. శ్రీశైలం, నందికొట్కూరు మండలాల్లో గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా చినుకు జాడ లేక వాడుపట్టిన పైర్లకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని, మిగతా పొలాల్లోనూ విత్తనాలు వేసుకోవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ముందస్తు సాగైన పైర్లకు ఎంతో మేలు
- విత్తు పనుల్లో అన్నదాత నిమగ్నం


పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు

పగిడ్యాల: వర్షాభావంతో వాడిపోతున్న మొక్కజొన్న పైర్లు శుక్రవారం కురిసిన వర్షానికి ఊపిరిపోసుకున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు మండలంలో 48.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 96 మిల్లీమీటర్లు కాగా కేవలం 29.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అయినా తీవ్ర వర్షభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ వర్షం పంటలకు ఎంతో మేలు చేస్తుని రైతులు పేర్కొంటున్నారు.

- పాములపాడు: మండలంలో శుక్రవారం 52.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కురిసిన వర్షపాతం ఇదే అధికం. పొలాల్లో మొలకెత్తిన పైర్లు వర్షం లేక వాడుపడుతున్న తరుణంలో ఈ వర్షం రైతన్నలకు ఎంతగానో ఊరటనిచ్చింది.
- జూపాడుబంగ్లా: మండలంలోని 36.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు.
- కొత్తపల్లి: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, వరి పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతన్నలు బయటికి పంపే పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో 5.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గువ్వలకుంట్ల, వీరాపురం ఎస్సీ కాలనీల వీధి రోడ్లు జలమయమయ్యాయి. విద్యార్థులు వర్షపు నీటిలోనే పాఠశాలకు రాకపోకలు సాగించారు.
- బండి ఆత్మకూరు : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన వర్షం మెట్ట పంటలకు జీవం పోసినట్లుయింది. మండలం లోని పరమటూరు, బండి ఆత్మకూరు, ఎర్రగుంట్ల గ్రామాల్లోని రైతులు మొక్క జొన్న, మినుము, సొయా చిక్కుడు మొదలైన మెట్ట పంటలను సాగు చేస్తున్నారు.

వర్షాలు లేక పంటలు ఎండిపోయే ఈ పరిస్థితుల్లో వర్షం పడటం తో పంటలు ప్రాణం పోసుకున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఈ వర్షం వరి నారు మడులు ఎదగడానికి అలాగే నాటు వేసిన పంట పెరగటానికి ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడింది. కాగా మండలంలో 51.4మి.మీ వర్ష పాతం నమోదయింది.


పొలంలో నీటిని బయటికి పంపుతున్న రైతు


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

- మహానంది: మండలంలో 24.6 మిల్లీమీటర్ల వర్షపాతనం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వర్షానికి మహానందీశ్వరుడి భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయం వెనుక ఉన్న నల్లమల కొండల పొగమంచులో మునిగినట్లు కనిపించడంతో భక్తులు చూసి తరించారు.
- ఆత్మకూరు: మండలంలో శుక్రవారం వేకువజామున భారీ వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. ముందస్తుగా సాగు చేసుకున్న పత్తి, మొక్కజొన్న తదితర పంటకు వర్షం మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. భవనాశి నది స్వల్పంగా ప్రవహిస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. కాగా మండలంలో 64.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

దత్తత నమోదు వంద శాతం పూర్తి చేయాలి

పగిడ్యాల: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బంగారు కుటుంబాల దత్తత నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి నాగేష్ మార్గదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పీ4 జీరో ప్రావర్టీ సర్వే సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్గదర్శులుగా ఉన్న ఒక్కో అధికారి మూడు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ ఎంపీడీఓ వీరన్నయాదవ్, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బైక్ స్టాండ్ ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణల బైక్ స్టాండ్ ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాండ్ లేకపోవడంతో అడ్డదిడ్డంగా నిలిపిన బైక్‌లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టెండర్లు పిలిచి బైక్ స్టాండ్ ఏర్పాటు చేయకపోతే బస్టాండ్ ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి



80బన్నూరు సొసైటీ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ జిల్లా నాయకుడు రమేష్, రైతులు

జూపాడుబంగ్లా: రైతుసేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం 80బన్నూరు సహకారసొసైటీ వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచకుండా మండల కేంద్రంలోని సొసైటీలో విక్రయిస్తుండటతో రైతులపై రవాణా చార్జీల భారం పడుతుందన్నారు. ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను నివారించి రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచకపోతే రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఏఓ కృష్ణారెడ్డి అక్కడికి చేరుకుని నిబంధనల ప్రకారం ఎరువులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మగ్బుల్‌బాషా, సలీం, చెంచన్న, రాజు, రైతులు నాగన్న, రమణ, రాముడు పాల్గొన్నారు.

సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలి


వివరాలు నమోదు చేస్తున్న వైద్యవిద్యార్థులు

జూపాడుబంగ్లా: ప్రభుత్వం అప్పగించిన సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ కాంతారావు సూచించారు. పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఇదివరకు చేపట్టిన ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేపై క్వాలిటీ అసెస్మెంట్ సర్వేను జిల్లా మెడికల్ కళాశాల విద్యార్థులతో శుక్రవారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు ఇచ్చారు. వైద్య విద్యార్థులు ఇంటింటికి వెళ్లి షుగర్, బీపీ, తదితర వ్యాధుల వివరాలు సేకరించి 3.0 సర్వేలో నమోదు చేసిన వివరాలతో సరిపోల్చారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ విజయకుమారి, అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ జహనాబీ, పారుమంచాల పీహెచ్‌సీ వైద్యులు యశస్విని, మౌనిక పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు

ఆత్మకూరు: పట్టణంలో ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ కోరారు. ధనుంజయ మీటింగ్‌హాల్‌లో శిక్షణ తరగతుల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించినప్పటి నుంచి విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, ప్రశాంత్, దిలీప్, సుజాత, నాగమ్మ, వెంకటశివుడు, లక్ష్మణ్, నరసింహానాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉప్పలదడియా వాసి మృతి


మృతి చెందిన సోమన్న

నందికొట్కూరు: మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో నేషనల్ హైవేపై నాగలూటి క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఉప్పలదడియా గ్రామ వాసి సోమన్న అలియాస్ ఆనందరావు (58) శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలు.. మిడుతూరు మండలం ఉప్పలదడియా గ్రామానికి చెందిన సోమన్న పని నిమిత్తం నందికొట్కూరుకు చాకలి రాముతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో నేషనల్ హైవేపై బైక్ అదపుతప్పి కిందపడటంతో సోమన్న అక్కడికక్కడే మృతిచెందగా రాముకి గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృడికి భార్య మరియమ్మ, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ లైన్‌మన్‌కు గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన సచివాలయ విద్యుత్ లైన్‌మన్ అక్రమ్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు టూటౌన్ సమీపంలోని పెద్ద పారంకంప చెట్టు విరిగి రహదారి పక్కనున్న మెయిన్ సప్లయ్ విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో శుక్రవారం లైన్‌మన్ అక్రమ్ అక్కడికి వెళ్లి తీగలపై పడ్డ ముళ్లకంపలను తొలగిస్తుండగా పవర్ రివర్స్ సప్లయ్ కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో సహ ఉద్యోగులు, స్థానికుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సీమ ప్రజాప్రతినిధులదేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా తెలుగుదేశం పార్టీని ఇక్కడి ప్రజలు ఆదరించారని, ఇందుకు కేఆర్‌ఎంబీని ఏర్పాటు చేసి రుణం తీర్చుకోవాలన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, కేఆర్‌ఎంబీ ఏర్పాటు అయితే తప్ప ఈ ప్రాంత రైతులకు న్యాయం జరగదని చెప్పారు.

21న పోస్టల్ సేవలు నిలిపివేత

నంద్యాల (వ్యవసాయం): ఈనెల 21న పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నంద్యాల పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ అప్పల స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సేవలను అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ 2.0లో మార్చుతున్నా సందర్భంగా ఈ అంతరాయమన్నారు. ఇందుకు పోస్టల్ కస్టమర్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం (కంప్యూటర్స్, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 21 నుంచి 30వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9492942337 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలు


దూడలకు టీకాలు వేస్తున్న డాక్టర్లు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని లింగాపురం, భోజనం గ్రామాల్లో వెటర్నరీ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు లంపీ స్కిన్ వ్యాధికి టీకాలు వేశారు. కార్యక్రమానికి జేవీఓ లక్ష్మీనారాయణ, ఆహా అర్జున్, గోపాలమిత్ర శంకర్ పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలో నిత్య కళా వేదికపై శ్రీశైలానికి చెందిన నృత్యకళాశాల వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, వినాయక కౌత్వం, హరహరశంభో, నమోనమో నటరాజ, శివాష్టకం, శివతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు రామతులసి, అర్చన, లక్ష్మి, పూజిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


గేదె మృతదేహం

నందికొట్కూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామ పొలిమేరలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం కరెంట్ తీగలు తగిలి గేదె మృతిచెందింది. మేత కోసం వెళ్లిన గేదెకు కంచె లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రజలు చర్చించుకున్నారు. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే రూ.60 వేల విలువ చేసే తన గేదె మృతిచెందిందని వేల్పుల జంబులయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

- జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు


కాలనీలో స్ప్రే చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర రావు

పాములపాడు: ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖరరావు సూచించారు. మిట్టకందాల గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పలు గృహాలను పరిశీలించారు. దోమల లార్వాలను గుర్తించారు. తొట్లలోని నీరును తొలగింపు చర్యలు చేపట్టారు. ప్రతిరోజు ఇంటింటికి తిరిగి జ్వర పీడితుల సర్వేను నిర్వహించాలని, రక్త నమూనాలు సేకరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


విచారణ నిర్వహిస్తున్న అధికారులు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులపై బహిరంగ సామాజిక తనిఖీ చర్చా వేదిక నిర్వహించారు. 14 గ్రామ పంచాయతీలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులపై 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎం అండ్ ఈ భాస్కర్ నాయుడు, ఏపీడీ అన్వరా బేగం సామాజిక తనిఖీ వివరాలను పరిశీలించారు. వాడాల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడ్డాడని, అతన్ని సస్పెండ్ చేయాలని మద్దూర్ సొసైటీ చైర్మన్ వాడాల జనార్దన్‌రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలో రూ.96,158 రికవరీకి అధికారులు ఆదేశించగా రూ.1,204 రికవరీ అయింది. పెనాల్టీ కింద రూ.46,300 టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.45,850 రికవరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సకాలంలో విధులకు హాజరవ్వాలి


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపికృష్ణ

జూపాడుబంగ్లా: సకాలంలో విధులకు హాజరు కావాలని ఎంపీడీఓ గోపికృష్ణ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం ఆయన తాటిపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించి విధులకు హాజరుకాని ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూరియా కొరత.. అన్నదాత ఆందోళన

- దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- నానో ఎరువులు తీసుకోవాలని షరతు


యూరియా కోసం సొసైటీని ఆశ్రయించిన రైతులు

పగిడ్యాల: ఖరీఫ్ సీజన్ వర్షధారం కింద మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు రెండవ మందు వేసేందుకు కాంప్లెక్స్, యూరియా ఎరువుల కోసం ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం పైర్లు సాగై 20 రోజుల నుంచి నెల రోజుల వ్యవధి అవుతోంది. శుక్రవారం కురిసిన వర్షానికి పైర్లకు మందు వేసుకోవడానికి మంచి అదును. దీంతో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కోసం రైతులు పరుగులు పెడుతున్నారు.

అయితే అక్కడ రైతులకు నిరాశ ఎదురవుతోంది. యూరియా లేదని, ఏదైనా ఒక బస్తా కొంటే తప్పనిసరిగా నానో యూరియా, నానో డీఏపీ, జింక్ పొడి ప్యాకెట్స్‌ను తీసుకోవాల్సిందేనని షరతు పెడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు ఒకే బస్తా యూరియా, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర నిబంధనలు ఉండటంతో పాసుపుస్తకాలు లేని రైతుల బాధలు వర్ణణాతీతం.

ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా



ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాను. వర్షం కురుస్తుండటతో యూరియా వేద్దామని దుకాణాలకు వెళ్తే నానో యూరియా, నానో డీఏపీ, జింక్ పొడి సంచులు అంటగడుతున్నారు. ఇప్పటికే పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పు చేశాను. ఇది మరింత ఆర్థిక భారంగా మారుతోంది. రైతులు కోరిన మందులే అమ్మేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– స్వామన్న, పడమర ప్రాతకోట

యూరియా దొరకడం లేదు



మొక్కజొన్న పంటకు కాంప్లెక్స్, యూరియా ఎరువులు వేద్దామంటే దొరకడం లేదు. మూడు రోజులుగా దుకాణాల చుట్టు తిరుగుతున్నా. ఎక్కడికి వెళ్లినా మరో మందు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ సమధానం చెబుతున్నారు. అధికారులు స్పందించి ఎరువుల కొరత లేకుండా చూడాలి.

– జంగిల్‌సాహెబ్, పడమర ప్రాతకోట

దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చాం

ఎరువుల కొరత ఎక్కడా లేదు. యూరియా కూడా అందుబాటులోనే ఉంది. ఎవ్వరైనా దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటాం. నానో ఎరువులు అంటగట్టకూడదని కూడా మండలంలోని అందరికి నోటీసులు ఇచ్చాం. అలా ఎవ్వరైన లింక్ బస్తాలు బలవంతంగా కరిపిస్తే వెంటనే మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం. సహకార సొసైటీకి 11 టన్నులు యూరియా వస్తుంది. రైతులు ఆందోళన చెందరాదు.

– మురళీధర్, వ్యవసాయ అధికారి, పగిడ్యాల